సాక్షి
అనకాపల్లి
మంగళవారం । 20 । ఫిబ్రవరి । 2024



ప్రగతికి శ్రీకారం

8లో

అనకాపల్లి, కశింకోట మండలాల్లో అరబిందో సీఎస్సార్ నిధులతో చేపట్టిన పలు పనులను మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి ప్రారంభించారు.



వేగంగా అర్జీల పరిష్కారం

కలెక్టరేట్ 'స్పందన'కు సోమవారం 299 అర్జీలు వచ్చాయి. త్వరగా పరిష్కరించాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. 8లో



అష్టదళ పద్మారాధన

విశాఖ కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు.

ఐఐఎంవీ నూతన శకం

విశాఖలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం) శాశ్వత క్యాంపస్ మంగళవారం ప్రారంభం కానుంది. 241.50 ఎకరాల్లో అడుగడుగునా అద్భుతమనేలా గ్రీన్ బిల్డింగ్ నిర్మాణ శైలి, స్మార్ట్ టెక్నాలజీతో రూపుదిద్దుకున్న క్యాంపస్‌ను ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి స్మృతి ఇరానీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఢిల్లీకి చెందిన ఆర్కిటెక్చర్ సంస్థ రూపొందించిన డిజైన్‌తో రెండు దశల్లో క్యాంపస్‌ను పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. తొలిదశలో రూ.472 కోట్లతో నిర్మాణ పనులు పూర్తయ్యాయి.

– సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం



గంభీరంలో నిర్మించిన ఐఐఎం విశాఖపట్నం క్యాంపస్

- అడుగడుగునా అద్భుతంగా.. హార్వర్డ్‌ను మించేలా నిర్మాణం
- నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోదీ, సీఎం జగన్



ఐఐఎంవీ - ముఖ్యాంశాలు

- 241.5 ఎకరాలను ఉచితంగా అందించిన రాష్ట్ర ప్రభుత్వం
- స్మార్ట్‌గా హరిత భవన నిర్మాణాలు
- రెండు దశల్లో రూ.807 కోట్లతో నిర్మాణానికి ప్రణాళికలు
- తొలిదశలో రూ.472 కోట్లతో భవనాలు, మౌలిక సౌకర్యాలు పూర్తి
- హార్వర్డ్ విశ్వవిద్యాలయాన్ని మించే సాంకేతికతతో సొబగులు
- 1,500 కిలోవాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు
- 7,200 పూల, ఫల, వృక్షజాతుల పెంపకం
- వాన నీటి సంరక్షణ చర్యలతో క్యాంపస్ నిర్మాణం

రాష్ట్ర విభజన బిల్లులో పొందుపరిచిన కేంద్ర విద్యా సంస్థల్లో ఒకటి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం) విశాఖపట్నం. 2015 నుంచి ఆంధ్ర విశ్వ విద్యాలయంలో తాత్కాలికంగా కార్యకలాపాలు ప్రారంభం కాగా.. తక్కువ కాలంలోనే విద్యా రంగంలో తనదైన ముద్ర వేసింది. ఐఐఎం క్యాంపస్ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆనందపురం-గంభీరం పరిసర ప్రాంతాల్లో 241.50 ఎకరాలను ఉచితంగా కేటాయించింది.

ఈ స్థలంలో రెండు దశల్లో క్యాంపస్ నిర్మాణం ప్రారంభించారు. ఫస్ట్ ఫేజ్‌లో రూ.472.61కోట్లతో భవనాలు, మౌలిక వసతుల పనులను పూర్తి చేశారు. మొత్తం 62,350 చదరపు మీటర్ల విస్తీర్ణంలో బిల్టప్ ఏరియాను అభివృద్ధి చేశారు. ఆర్‌కాప్ అసోసియేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే ఢిల్లీ సంస్థ ఈ బిజినెస్ స్కూల్ ప్లాన్ రూపొందించింది. ప్రపంచ ప్రసిద్ధ హార్వర్డ్ విశ్వవిద్యాలయాన్ని మించేలా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇక్కడ నిర్మాణాల్లో మిళితం చేయడం విశేషం.



విద్యార్థులకు జిమ్ సౌకర్యం

గ్రీన్ బిల్డింగ్ కాన్సెప్ట్‌తో నిర్మాణం

పర్యావరణహిత భవనంగా ఐఐఎం క్యాంపస్‌ను తీర్చిదిద్దారు. పరిసరాల్లో ఉన్న ప్రకృతి వనరులను సద్వినియోగం చేసుకుంటూ.. అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తూ భవనాలను నిర్మించారు. దేశంలోనే ప్రత్యేకంగా నిలిచేలా జాతీయ రహదారి నుంచి క్యాంపస్ వరకు, క్యాంపస్ చుట్టూ 7,200 వివిధ రకాల చెట్లు, మొక్కలు నాటారు. ఈ స్థలం కొండల మధ్య ఉండటంతో.. నీటి వనరులు పుష్కలంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో వాన నీటిని ఒడిసి పట్టేలా జల సంరక్షణ చర్యలు చేపట్టారు.

అత్యున్నత ప్రమాణాలతో క్యాంపస్ సిద్ధం



గ్రీన్ రేటింగ్ ఫర్ ఇంటిగ్రేటెడ్ హ్యాబిటేట్ అసెస్మెంట్(గృహ) సిస్టం ద్వారా 5 స్టార్ రేటింగ్ సొంతం చేసుకునేలా ఐఐఎం విశాఖపట్నం కొత్త క్యాంపస్ నిర్మాణం తొలిదశ పూర్తయింది. రెండు ఫేజ్‌లలో మొత్తం రూ.807.69కోట్లతో క్యాంపస్‌ను నిర్మిస్తున్నాం. మొత్తం 1,170 మంది విద్యార్థులకు సరిపడా నిర్మాణాలు చేపట్టాల్సి ఉండగా.. మొదటి దశలో 600 మందికి వీలుగా అన్ని భవనాలు పూర్తయ్యాయి. పర్యావరణానికి అనుకూలమైన నిర్మాణ ప్రమాణాలకు అనుగుణంగా పచ్చదనం అభివృద్ధి చేశాం.

– ప్రొ.ఎం.చంద్రశేఖర్, ఐఐఎం, విశాఖపట్నం డైరెక్టర్

విభిన్న ప్రత్యేకతల సమాహారం

- క్యాంపస్‌లో అవసరాలకు కావాల్సిన దానికంటే అధికంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేసేలా 1,500 కిలోవాట్ల సామర్థ్యంతో ప్లాంట్‌ను నిర్మించారు. ఈ ప్లాంట్ ద్వారా ఏడాదికి 22.59 లక్షల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి కానుంది.
- కోవిడ్‌లో ఎదురైన పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని తగిన చర్యలు చేపట్టారు. ఇక్కడ ఏర్పాటు చేసిన పరికరాలను వినియోగించడానికి చేతులతో స్విచ్‌లు నొక్కే పరిస్థితి లేకుండా.. సెన్సార్లు ఆధారంగా పనిచేసేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.
- హార్వర్డ్ విశ్వవిద్యాలయ నమూనాను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు 'యు'ఆకారంలో కూర్చొనేలా తరగతి గదులు నిర్మించారు. 50 మంది, వంద మంది కూర్చొనేలా ఏసీ క్లాస్ రూంలు సిద్ధమయ్యాయి.
- వంద సీట్లు ఉన్న 10 క్లాస్ రూమ్‌లు, 50 సీట్లున్న క్లాస్‌రూమ్‌లు 10 నిర్మించారు. వీటికి అదనంగా మరో 5 తరగతి గదులు నిర్మించారు. ప్రొఫెసర్లకు 117 రూమ్స్ అవసరం కాగా.. ఇప్పటికే సగానికి పైగా పూర్తయ్యాయి.
- ప్రత్యేక తరగతులు చెప్పేందుకు దేశవిదేశాల నుంచి వచ్చే ప్రముఖులకు 60 గదులతో కూడిన ఫైవ్‌స్టార్ హోటల్ పోలిన అతిథిగృహం ఏర్పాటు చేశారు.
- ప్రొఫెసర్లు పాఠాలు మొదలు పెట్టిన వెంటనే అత్యాధునిక సెన్సార్లు గ్రహించి.. స్పీకర్లు వాటంతట అవే ప్రారంభమయ్యేలా టెక్నాలజీ రూపొందించారు. క్లాస్ జరుగుతున్నప్పుడు ఎవరైనా విద్యార్థి మాట్లాడితే.. ఆ విద్యార్థి ఫొటో అందరికీ కనిపించేలా బోర్డుపై ప్రత్యక్షమవ్వడంతో పాటు వారి మాటలు కూడా వినిపిస్తాయి.
- ప్రతీ ప్రొఫెసర్ చెప్పే పాఠం కూడా రికార్డవుతుంది. ఈ రికార్డు చేసిన పాఠాలను ఐఐఎం వెబ్‌సైట్‌లో విద్యార్థుల కోసం రెండు వారాల పాటు నిక్షిప్తం చేస్తారు. ఎవరికి ఎలాంటి సందేహం ఉన్నా.. ఈ వీడియో చూసి తెలుసుకోవచ్చు.
- విద్యార్థులకు సంబంధించిన హాస్టళ్లలోని ప్రతి రూమ్‌లోనూ ఏసీ, టీవీ, ఫ్రిజ్, ఒవెన్, కెటిల్, వాషింగ్ మిషన్ ఏర్పాటు చేశారు.
- రోజుకు 216 కిలోలీటర్ల సామర్థ్యంతో వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్, 150 కిలోలీటర్ల సామర్థ్యంతో మురుగు నీటి నిర్వహణ ప్లాంట్ నిర్మించారు.
- విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఫిఫా సైజ్ ఫుట్‌బాల్ గ్రౌండ్, గ్రీన్ క్రికెట్ ఫీల్డ్, ఇండోర్, అవుట్‌డోర్ గేమ్స్ ఫెసిలిటీ, జిమ్, యోగా, మెడిటేషన్ సెంటర్లు సిద్ధం చేశారు.



గ్రీన్‌ఫీల్డ్ క్రికెట్ మైదానం

న్యూస్‌రీల్

రేపు శ్రీశారదా పీఠానికి సీఎం వైఎస్ జగన్



ఏర్పాట్లపై స్వాత్మానందేంద్రతో చర్చిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్

పెందుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం విశాఖ శ్రీశారదా పీఠాన్ని సందర్శించనున్నారు. గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో 11.20 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో చినముషిడివాడలోని శ్రీశారదా పీఠానికి 11.40 గంటలకు వస్తారు. పీఠంలో పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీలతో కలిసి పీఠంలోని దేవతామూర్తులకు సీఎం జగన్ ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం 12.55కి విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుని గన్నవరం బయలుదేరుతారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా చినముషిడివాడలోని శారదా పీఠాన్ని కలెక్టర్ ఎ.మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ సోమవారం రాత్రి సందర్శించారు. స్వామీజీల ఆశీర్వచనం తీసుకున్నారు. అనంతరం సీఎం పర్యటన ఏర్పాట్లపై స్వాత్మానందేంద్రతో కలిసి సమీక్షించారు.

ఏపీపీఎస్సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



జేసీ జాహ్నవి

తుమ్మపాల: ఈనెల 25న నిర్వహించే ఏపీపీఎస్సీ పరీక్ష సజావుగా జరిగేందుకు జిల్లాలో అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ చిన్న పొరపాటుకు కూడా ఆస్కారమివ్వకుండా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం, మాకవరపాలెంలలో 33 విద్యా సంస్థల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం వరకు పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్ష కేంద్రాల్లో తగిన మౌలిక వసతులు కల్పించాలన్నారు. పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 10,627 మంది అభ్యర్థులు హాజరవుతారన్నారు. రూట్ ఆఫీసర్స్ అయిన జిల్లా అధికారులు లైజన్ అధికారులైన తహసీల్దార్లు, ఎంపీడీవోలు వారికి కేటాయించిన పనుల్లో ఎటువంటి లోపాలు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, సెక్షన్ సూపరింటెండెంట్ డి.రామ్మూర్తి, ఎస్.ఎ.రహ్మాన్ పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ఎంపీ హైకోర్టు న్యాయమూర్తి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న జస్టిస్ దుప్పల వెంకటరమణ దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తరంపూజ నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదాన్ని, జ్ఞాపిక, శేషవస్త్రాన్ని ఏఈవో పాలూరి నరసింగరావు అందజేశారు.

శివరాత్రి రోజున ఆలయాల్లో విస్తృత ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న సుధారాణి

అనకాపల్లి: మహాశివరాత్రి రోజున ఆలయాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం ఏర్పడకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని దేవదాయ శాఖ జిల్లా అధికారి కె.ఎల్.సుధారాణి చెప్పారు. స్థానిక నూకాంబిక ఆలయంలో సోమవారం జిల్లాలోని దేవదాయ శాఖ కార్యనిర్వహణ అధికారులతో ఆమె సమావేశమయ్యారు. భక్తులకు త్వరగా దర్శనం అయ్యేలా చూడాలని చెప్పారు. మంచినీరు, చలువపందిళ్లు, క్యూలైన్లు, విద్యుత్ అలంకరణ, స్వామివారికి పూల అలంకరణ, పరిశుభ్రమైన వాతావరణంలో ప్రసాదాల పంపిణీ ఏర్పాటు చేయాలని సూచించారు.

రక్తహీనతపై కలెక్టర్ సమీక్ష



వైద్యులు, విద్యాశాఖ అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

- అదుపులోకి రాని చోట కారణాలు విశ్లేషించండి
- రక్తహీనత నివారణకు ప్రణాళికాయుత చర్యలు
- వైద్య, విద్యాశాఖ అధికారులకు ఆదేశం

తుమ్మపాల: విద్యార్థులు, గర్భిణుల్లో రక్తహీనతను సీరియస్‌గా పరిగణించాలని, నివారణకు ప్రణాళికాయుతంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం అన్ని పీహెచ్‌సీల వైద్యులు, మండల విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏయే గ్రామాలు, సచివాలయ పరిధిలో రక్తహీనత ఉందో గుర్తించి తగిన పౌష్టికాహారం, మందులు వాడేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు చేపట్టిన చర్యల గురించి, మండలాలు, పాఠశాలల వారీగా విద్యార్థుల్లో కలిగిన రక్తహీనత గురించి అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. కొన్ని మండలాలు, ప్రాంతాల్లో హెచ్‌బీ శాతం తగ్గుదలకు గల కారణాలను విశ్లేషించి తగిన విధంగా పౌష్టికాహారం, మందులు వాడేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది ద్వారా విద్యార్థులు, గర్భిణులకు పౌష్టికాహారంపై పూర్తి అవగాహన కలిగించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎ.హేమంత్, జిల్లా విద్యాశాఖ అధికారి మహాలక్ష్మమ్మ, స్త్రీ శిశు సంక్షేమ అధికారి అనంతలక్ష్మి సమావేశంలో పాల్గొన్నారు.

ఇదీ.. నౌకాదళ 'సూర్య' ప్రతాపం

నింగీ నేలా ఏకం చేసేలా భారత నౌకాదళం సత్తా చాటుతోంది. భారత్, మిత్రదేశాలతో కలిసి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మిలాన్-2024లో.. ప్రపంచానికి నౌకాదళ శౌర ప్రతాపాన్ని మరోసారి ప్రదర్శించనుంది. ఇందులో భాగంగా.. ఆర్‌కే బీచ్‌లో జరుగుతున్న రిహార్సల్స్‌లో నేవీలో కొత్తగా చేరిన సీహాక్స్ హెలికాప్టర్.. ఇలా సూర్యున్ని చీల్చుకుంటూ దూసుకుపోతూ.. అబ్బురపరిచింది.

– సాక్షి, ఫొటోగ్రాఫర్



సూర్యుడితో పోటీ పడుతూ..

చప్పగా సాగిన శంఖారావం

- అవగాహన లేని లోకేష్ వ్యాఖ్యలు
- ఆసక్తి కనబరచని ప్రజలు
- టీడీపీ, జనసేనల నుంచి కనీసం 2 వేల మంది కూడా రాని దుస్థితి
- పత్తా లేని మాజీ మంత్రి కొణతాల
- దాడి, పంచకర్ల, నాగ జగదీష్ మాట్లాడేందుకు నో చాన్స్
- తెలుగు తమ్ముళ్ల మధ్య అగ్గి రగిల్చిన చినబాబు



వెలవెలబోయిన వడ్డాది సభ

సాక్షి, అనకాపల్లి: టీడీపీ నేత నారా లోకేష్ ఎన్నికల శంఖారావం సభలు జిల్లాలో చప్పగా సాగాయి. సోమవారం విశాఖ పర్యటన ముగించుకుని మధ్యాహ్నం అనకాపల్లి టౌన్, బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో అడుగుపెట్టిన లోకేష్‌కు జనస్పందనే కరువైంది. అనకాపల్లిలో మధ్యాహ్నం 2 గంటలకు ఏర్పాటు చేసిన శంఖారావం సభ జనం లేక సాయంత్రం 5 గంటలకు ప్రారంభమైంది. సుమారు రెండు గంటల పాటు లోకేష్ టెంట్‌లోనే ఉండిపోయారు. అనకాపల్లి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పీలా గోవిందు అర్ధ గంటకు పైగా మాట్లాడారు. సీనియర్ నేత దాడి వీరభద్రరావు, బుద్దా నాగ జగదీష్, జనసేన రూరల్ అధ్యక్షుడు పంచకర్లకు మాట్లాడే అవకాశం కల్పించలేదు. దీనికి తోడుగా అవగాహనరాహిత్యంతో సాగిన లోకేష్ ప్రసంగంతో కార్యకర్తలు విసుగు చెందారు. టీడీపీ, జనసేన పార్టీలు రెండూ కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో కనీసం 2 వేల మంది కూడా ప్రజలు లేరు. సభలో సుమారు వెయ్యి కుర్చీలు వేశారు. లోకేష్ ప్రసంగిస్తున్న సమయంలోనే అందులో సగం ఖాళీగా అయిపోయాయి. కేంద్ర ప్రభుత్వ పరిధిలో అంశాలైన పెట్రోల్, డీజిల్ ధరలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెంచిందని, గ్రూప్-1, గ్రూప్-2 నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసినా.. ఇంకా చేయలేదని విమర్శించడం లోకేష్ అవగాహన రాహిత్యానికి అద్దం పట్టాయి. జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో రాష్ట్రం దివాలా తీసిందని, టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ పథకాలు కట్‌చేసి.. రోడ్లు వేస్తామని అనేసరికి అక్కడ మహిళా కార్యకర్తలు కలవరపడ్డారు.

దాడి, పంచకర్లకు నో చాన్స్

లోకేష్ ఎన్నికల శంఖారావం సభలో ఇటీవల టీడీపీలో చేరిన మాజీ మంత్రి దాడి వీరభద్రరావుకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. లోకేష్ నోట ఆయన పేరు కూడా రాకపోవడం గమనార్హం. మరో సీనియర్ నేత, అనకాపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి బుద్దా నాగ జగదీష్‌కు కూడా మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకుండా పరోక్షంగా లోకేష్ చెక్ పెట్టారు. కంటి తుడుపుగా ×జగదీష్ అన్నా.. ఆలస్యం అయింది.. నీకు మరోమారు అవకాశం ఇస్తాను¤ని అన్నారు. దాడి వీరభద్రరావుకు అయితే ఆ మాట కూడా అనలేదు. ఇక జనసేన విశాఖ రూరల్ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబును మరింత అవమానించారు. ఆయన ప్రసంగిస్తారని జనసేన కార్యకర్తలు ఎదురుచూస్తుండగా.. ఆయనకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదు సరికదా.. లోకేష్ నోట ఆ పేరు కూడా పలకలేదు. పీలా గోవిందుకు ప్రాధాన్యం ఇచ్చి, నాగ జగదీష్‌కు మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడంతో అసలే ఉప్పు నిప్పుగా ఉన్న ఇద్దరి మధ్య లోకేష్ శంఖారావం మరింత అగ్గి రాజేసినట్టయింది.

ఆచూకీ లేని కొణతాల: గత నెల రోజులుగా జనసేన పార్టీలో అనకాపల్లి ఎంపీగా పోటీ చేస్తానని ప్రచారం చేసుకున్న మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ ఆచూకీ శంఖారావంలో ఎక్కడా కనిపించలేదు. కనీసం సభ దగ్గర, రోడ్ల కిరువైపుల ఉన్న కటౌట్లలో కూడా ఎక్కడా కొణతాల ఫొటోలు కనిపించలేదు. లోకేష్ పథకం ప్రకారమే కొణతాలకు పరోక్షంగా చెక్ పెట్టాడని తెలుగు తమ్ముళ్లు చెవులు కొరుక్కున్నారు. అలగడం అలవాటైన కొణతాల.. తనకు ప్రాధాన్యం దక్కకపోవడంతో మరోసారి అలిగి ఉంటారని అంతా అనుకున్నారు.

స్టేజ్‌పై కనిపించని దిలీప్ చక్రవర్తి: ఇటీవల లోకేష్ యువగళం పాదయాత్ర ఖర్చు భరించడంతోపాటు రూ.50 కోట్ల వరకు టీడీపీకి ఫండ్‌గా ఇచ్చాడని ప్రచారం నడిచిన బైరా దిలీప్ చక్రవర్తి శంఖారావంలో ఎక్కడా కనిపించలేదు. కటౌట్లలో మాత్రం ఫొటోలు కనిపించాయి. తెర వెనక ఉన్న దిలీప్ స్టేజ్ పైకి ఎందుకు రాలేదన్న ప్రశ్నలు తెలుగు తమ్ముళ్లలో మెదిలాయి.

మాజీ ఎమ్మెల్యే రాజుకు దక్కని ప్రాధాన్యం

బుచ్చెయ్యపేట: వడ్డాది సభలో కూడా యథావిధిగా లోకేష్ ప్రసంగం ఆకట్టుకోలేకపోయింది. జనం లేక చాలాసేపు సభ ప్రారంభించలేదు. మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజుకు మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడంపై పలువురు కార్యకర్తలు, నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆదుకుంటామని లోకేష్, ఇతర నేతలు మాట్లాడగా.. మీ హయాంలోనే ఫ్యాక్టరీ కష్టకాలంలోకి వెళ్లిందని, అప్పుడు వదిలేసి ఇప్పుడు మాయ మాటలు చెబుతున్నారని జనం చర్చించుకున్నారు.

కేజీహెచ్‌లో మరో ఐసీయూ పిల్లల వార్డు

మహారాణిపేట (విశాఖ): కేజీహెచ్‌లో ఆధునిక వసతులతో మరో ఐసీయూ పిల్లల వార్డును అందుబాటులోకి తీసుకొచ్చేందుకు యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇప్పటికే అక్కడ వార్డు కన్వర్షన్ పనులు చేపట్టింది. ఆయా పనులను పరిశీలించేందుకు సోమవారం కేజీహెచ్ పిల్లల వార్డుకు వెళ్లిన కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధికారులు పలు మార్గదర్శకాలు జారీ చేశారు. నవజాత శిశు అత్యవసర వైద్య విభాగంలో చేపట్టిన పునఃనిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ఆధునిక మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. కేజీహెచ్ ఆసుపత్రిలో చేపడుతున్న నవజాత శిశు అత్యవసర వైద్య విభాగం పునఃనిర్మాణ పనులు, పిల్లల వార్డు, పరిసర ప్రాంతాలతో పాటు తాగునీరు తదితర ఏర్పాట్లను ఆయన స్వయంగా పరిశీలించారు. నవజాత శిశు అత్యవసర వైద్య విభాగం వార్డును ఐసీయూ వార్డుగా కన్వర్షన్ చేయటంలో భాగంగా చేపడుతున్న నిర్మాణ పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా పనులు చేపట్టాలన్నారు. ఈ వార్డుతో పాటు పిల్లల వార్డుకు అవసరమైన అన్ని వైద్య పరికరాలను సిద్ధం చేయాలని, అవసరమైతే మరిన్ని నిధులను వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.



పిల్లల వార్డు వద్ద రోగులతో మాట్లాడుతున్న విశాఖ కలెక్టర్ మల్లికార్జున

చిన్నారికి అవసరమైన వైద్యాన్ని అందిస్తాం

కేజీహెచ్ సందర్శనలో భాగంగా అక్కడ ఉన్న రోగులతో కలెక్టర్ మల్లికార్జున మాట్లాడారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్యం, వసతులపై వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చింతపల్లి మండలం లంబసింగి గ్రామానికి చెందిన మారిన సత్యవతి తన ఏడాది కుమార్తె అయిన గౌరీశ్రీకి పుట్టుకతోనే కాళ్లు, చేతులు లేవని తన బిడ్డను ఆదుకోవాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఆయన చిన్నారికి అవసరమైన పూర్తి వైద్యాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డా.అశోక్ కుమార్, ఏఎంసీ ప్రిన్సిపాల్ డా. బుచ్చిరాజు, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ డీపీ నాయుడు, ఆర్ఎంవో డాక్టర్ లక్ష్మితులసీ, ఇతర విభాగాల వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

మిలాన్‌కు పటిష్ట భద్రత



మాట్లాడుతున్న జాయింట్ సీపీ ఫకీరప్ప


విశాఖ సిటీ: మిలాన్-2024కు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు జాయింట్ పోలీస్ కమిషనర్ కె.ఫకీరప్ప చెప్పారు. సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీ వరకు జరగనున్న మిలాన్ 12వ ఎడిషన్‌లో 56 దేశాలకు చెందిన ప్రతినిధులు హాజరవుతున్నట్లు తెలిపారు. 20వ తేదీన ఫుల్ డ్రెస్ రిహార్సల్స్, 21న ప్రముఖుల రాకపోకలు, 22న ఇంటర్నేషనల్ సిటీ పరేడ్ కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. ఉపరాష్ట్రపతి, కేంద్ర రక్షణ శాఖ మంత్రి, రాష్ట్ర గవర్నర్, భారత నావికాదళపతి మిలాన్ విన్యాసాలను తిలకించడానికి వస్తున్నట్లు వెల్లడించారు. మిలాన్ నిర్వహణ, ప్రముఖుల భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం 3,536 మంది పోలీస్ అధికారులు, సిబ్బందిని వినియోగిస్తున్నట్లు చెప్పారు. ఏడుగురు ఐపీఎస్ అధికారులు, డీసీపీలు, ఏడీసీపీలు, ఏసీపీలు ఇలా ఉన్నతాధికారులతో 18 సెక్టార్లుగా విభజించి బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వీవీపీలతో పాటు మిలాన్ సందర్శనకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ నెల 22వ తేదీ వరకు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 8 వరకు నేవల్ కోస్టల్ బ్యాటరీ నుంచి పార్క్‌హోటల్ వరకు వాహనాల రాకపోకలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు, పార్కింగ్ ఏర్పాట్లను వివరించారు.

కరాటే పోటీల్లో కశింకోట విద్యార్థుల ప్రతిభ


బంగారు, వెండి పతకాలు సాధించిన కశింకోట సెయింట్ జాన్స్ స్కూల్ విద్యార్థులు

కశింకోట: ఏపీ స్టేట్ డ్రాగన్ రియాన్ కరాటే చాంపియన్‌షిప్–2024 పోటీల్లో కశింకోట సెయింట్ జాన్స్ స్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు ప్రతిభ చూపి బంగారు, వెండి పతకాలను కైవసం చేసుకున్నారు. వాడోకాయి కరాటే డు డ్రాగన్ రియాన్ కరాటే డు సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల రాష్ట్ర స్థాయిలో రాజాంలో నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు సిహెచ్.థామేశ్వర్ అభిరాం సాయి, ఎ.లోహిత స్వర్ణ పతకాలు, కె.పునీత్, ఎ.ఆరాధ్య దీక్షిత వెండి పతకాలు గెలుపొందారు. వీరిని సోమవారం స్కూల్ ప్రిన్సిపాల్ రూపనంది, అకడమిక్ ఇన్‌చార్జి చంద్రమౌళి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

పంచాయతీ ఈవో మృతి


ఈవో సుదర్శనరావు (ఫైల్)

మాకవరపాలెం: మాకవరపాలెం మేజర్ పంచాయతీ ఎగ్జిక్యూటివ్ అధికారి(ఈవో) సుదర్శనరావు మృతి చెందారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఆయన గత రెండేళ్లుగా ఇక్కడ ఈవోగా పనిచేస్తున్నారు. ఇటీవల ఆయనకు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో శ్రీకాకుళంలో శస్త్రచికిత్సలు చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున ఆయన మరణించారు. ఆయన మృతికి పంచాయతీ పాలకవర్గ సభ్యులతోపాటు తోటి కార్యదర్శులు, మండల పరిషత్, సచివాలయ సిబ్బంది సంతాపం తెలియజేశారు.

వేగవంతంగా అర్జీల పరిష్కారం

- అధికారులకు కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి ఆదేశం
- కలెక్టరేట్ 'స్పందన'కు 299 అర్జీలు

తుమ్మపాల: స్పందన–జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చే దరఖాస్తులు, ఫిర్యాదులకు తెలిపే సమాధానాలు సంతృప్తికర స్థాయిలో ఉండాలని అధికారులను కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించి మాట్లాడారు. వీలైనంత వేగంగా అర్జీలను పరిష్కరించాలని ఆదేశించారు. తిప్పి పంపే దరఖాస్తు, ఫిర్యాదుపై తిరస్కరణ గూర్చి వివరంగా తెలియజేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్, భూసర్వే సహాయ సంచాలకులు ఎస్.గోపాలరాజు స్పందన వేదిక నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 299 అర్జీలు నమోదయ్యాయి. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో పోలినాయుడు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.హేమంత్, జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శిరీషారాణి, జిల్లా ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆస్తి రాయించుకుని తల్లిని వదిలేసిన కొడుకు

'నా భర్త మరణానంతరం నాకు తెలియకుండా భూములను నా కుమారుడు తన పేరున రాయించుకుని నన్ను రోడ్డున పడేశాడు' అని తల్లి తలారి కొండమ్మ స్పందనలో ఫిర్యాదు చేసి కలెక్టర్‌కు విన్నవించుకుంది. కోటవురట్ల మండలం రామచంద్రాపురంలో నివసిస్తున్న తమకు సొంతిల్లుతోపాటు వ్యవసాయ భూములు ఉన్నాయని, ఇటీవల జరిగిన రీసర్వేలో తనకు తెలియకుండా తన కుమారుడు రామునాయుడు పట్టాదారు పాసుపుస్తకాలు తన పేరున చేయించుకుని తనను చూడడం లేదని వాపోయింది. సీఎం జగన్ ఇస్తున్న పింఛన్‌తోనే జీవిస్తున్నానని, తక్షణమే అధికారులు స్పందించి తన పేరున పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని కోరింది.

పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయండి

పూర్వకాలంగా సాగు చేసుకుంటూ జీవిస్తున్న తమ భూములను సాగుహక్కు ఆధారంగా తమ పేరున నమోదు చేసి పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలంటూ వి.మాడుగుల మండలం లక్ష్మీపేటకు చెందిన గిరిజనులు స్పందనలో అర్జీ అందించారు. సర్వే నంబర్ 166, 164, 165లో సుమారు 30 ఎకరాల భూమిని 19 మంది గిరిజనులమైన తాము సాగుచేసుకుంటున్నామని తెలిపారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం సాగుభూములను మా పేరున నమోదు చేస్తూ ఇందిర ప్రభ పుస్తకాలను మంజూరు చేసిందన్నారు. కొన్ని రోజుల కిందట ఆర్డీవో వారు మా భూముల వద్దకు వచ్చి వాటిని వదులుకోవాలని కోరారని, తాము అంగీకరించకపోవడంతో రీసర్వేలో మా భూములను ఇతరుల పేరున నమోదు చేసేందుకు చర్యలు చేపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. గిరిజనులమైన తమకు న్యాయం చేసి పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని కోరారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

ప్రభుత్వ హెచ్చరిక బోర్డులను తొలగించి నిర్మిస్తున్న బహుళ అంతస్తులను తక్షణమే నిలిపివేయాలని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలంటూ పరవాడ మండలం సాలాపువానిపాలెం గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. అనకాపల్లి మండలం మారేడుపూడి సర్వే నంబర్ 357 ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను గుర్తించి ఇటీవల ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను తొలగించి పరవాడకు చెందిన కొందరు వ్యక్తులు చేపడుతున్న అనధికార నిర్మాణాలపై మూడు ఫిర్యాదులో స్పందనలో చేశారు.

స్పందించని అధికారులపై చర్యలు చేపట్టాలి

ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో సౌకర్యాలపై స్పందనలో ఫిర్యాదు చేస్తే విద్యుత్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు కనీసం స్పందించడం లేదని, వారిపై చర్యలు తీసుకోవాలని డీవీఎంసీ సభ్యుడు రేబాక మధుబాబు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

పరీక్షల నేపథ్యంలో హాస్టళ్లలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, తాము గుర్తించిన సమస్యలను పరిష్కరించాలని కోరారు.


స్పందనలో అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి



అర్జీదారుడితో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

ఫిర్యాదుల పరిష్కారానికి తక్షణ చర్యలు

అనకాపల్లి: చట్ట పరిధిలో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్టు జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తెలిపారు. తన కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో 41 మంది అర్జీదారుల సమస్యలు తెలుసుకున్నారు. జిల్లాలోని తమ పోలీస్ స్టేషన్లలో వచ్చిన ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించి పరిష్కారానికి కృషి చేయాలని ఎస్పీ ఆదేశించారు. కార్యక్రమంలో క్రైం ఎస్పీ పి.సత్యనారాయణరావు, అర్జీదారులు పాల్గొన్నారు.

చంపేస్తానంటూ బెదిరిస్తున్నారు..

తమ గ్రామంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలపై కరెంట్ సర్వీస్ సమాచార హక్కు చట్టం ద్వారా వివిధ శాఖల అధికారులను సమాచారం కోరగా.. కొంతమంది తనపై కక్ష కట్టి చంపేస్తానంటూ బెదిరింపులు వస్తున్నాయని ఎస్.రాయవరం మండలం దార్లపూడికి చెందిన కోన బాబూరావు ఎస్పీకి స్పందనలో ఫిర్యాదు చేశాడు.

ప్రగతికి శ్రీకారం

- అరబిందో సీఎస్సార్ నిధులతో చేపట్టిన పలు పనులు ప్రారంభం
- పాల్గొన్న మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి

అనకాపల్లి/కశింకోట: సంక్షేమాభివృద్ధిలో రాష్ట్రం ముందంజలో ఉందని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దార్శనికతను అర్థం చేసుకొని పరిశ్రమలు సేవా కార్యక్రమాలకు ముందుకు రావడం సంతోషదాయకమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, వాణిజ్యశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. అనకాపల్లి, కశింకోట మండలాల్లో అరబిందో ఫార్మా లిమిటెడ్ సీఎస్సార్ నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఆయన ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతితో కలిసి ప్రారంభించారు. అనకాపల్లి మండలం వెంకుపాలెంలో రూ.1.15 కోట్లతో సామాజిక భవనాన్ని, కశింకోటలో రూ.కోటితో, ఉగ్గినపాలెంలో రూ.50 లక్షలతో కల్యాణ మండపాలను అరబిందో సంస్థ నిర్మించింది. వీటిని ప్రారంభించిన అనంతరం మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించి, మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. తాను ఇచ్చిన హామీల మేరకు గ్రామంలో కల్యాణమండపాలు, సామాజిక భవనాలను నిర్మించిట్లు చెప్పారు. అరబిందో యాజమాన్యం నియోజకవర్గం అభివృద్ధికి రూ.5 కోట్లు ఖర్చు చేసిందన్నారు. శంకరం గ్రామంలో సామాజిక భవనానికి, కశింకోట ఇందిరా కాలనీలో రూ.50 లక్షల ఎంపీ నిధులతో నిర్మించనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక భవనానికి మంత్రి, ఎంపీ శంకుస్థాపన చేశారు. పరవాడపాలెంలో రామాలయ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఎంపీ సత్యవతి మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు కొలిక్కిరావడం, వాటి ప్రారంభోత్సవాల్లో తాను పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, ఏపీ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీపీలు గొర్లి సూరిబాబు, కలగా లక్ష్మి, అరబిందో ఫార్మా లిమిటెడ్ ప్రతినిధి ఎస్ఆర్‌రావు, ఎడ్మిన్ హెడ్ వెంకటరామకృష్ణ,, వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, మండల వైస్ ఎంపీపీలు నమ్మి మీనా, పెంటకోట జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


కశింకోటలో కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి

కొలువుదీరనున్న 36 అడుగుల అభయాంజనేయుడు

- విగ్రహ నిర్మాణానికి ఘనంగా భూమిపూజ

దేవరాపల్లి: మండల కేంద్రం దేవరాపల్లి నాలుగు రోడ్ల కూడలిలో 36 అడుగుల అభయ ఆంజనేయ స్వామి విగ్రహ నిర్మాణానికి సోమవారం ఘనంగా శంకుస్థాపన జరిగింది. ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, భాస్కరరావు దంపతులు వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ భూమిపూజ చేశారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు సతీమణి బూడి రమణమ్మ కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళల కోలాటం, చిటికెల భజనలతో ఆధ్యాత్మిక సందడి సంతరించుకుంది. వేకువజాము నుంచి మధ్యాహ్నం వరకు యాగం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు జైశ్రీరామ్.. జై హనుమాన్ నామస్మరణలతో తరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, రాష్ట్ర మహిళ సంయుక్త కార్యదర్శి రొంగలి నారాయణమ్మ, కొప్పల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డా.వరదపురెడ్డి సింహాచలంనాయుడు, స్థానిక సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గొర్రుపోటు రమాదేవి, గండిపడాల అప్పలరాజు, గుండు రాంబాబు, వాలేటి నాగరాజు, గొర్లి సన్యాశినాయుడు, దీవి శంకర్, బంధం అప్పలరాజు తదితర గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


భూమిపూజలో పాల్గొన్న ఎంపీపీ రాజేశ్వరి, భాస్కరరావు దంపతులు, బూడి రమణమ్మ

పూర్వీ రజాక్‌కు అభినందన

ఎంవీపీ కాలనీ(విశాఖ): వివిధ నైపుణ్యాలతో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించిన పూర్వీ రజాక్‌ను విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అభినందించారు. సూపర్ టాలెంట్ కిడ్‌గా పూర్వీ రజాక్ 2022లో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించారు. దీంతోపాటు కళలు, సాహిత్యం, క్రీడా రంగాల్లో 12 ఏళ్ల వయసులోనే 300 వరకు అవార్డులు గెలుచుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం లాసన్స్‌బే కాలనీలోని ఎంపీ కార్యాలయంలో పూర్వీరజాక్‌ను ఎంవీవీ సత్కరించారు. రానున్న రోజుల్లో మరిన్ని రికార్డులు సృష్టించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మొల్లి అప్పారావు, శివరామకృష్ణ, పీతల గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

శారదా సన్నిధిలో ఆధ్యాత్మిక పెన్నిధి

ఘనంగా ముగిసిన శ్రీశారదా పీఠం వార్షికోత్సవాలు


ప్రవచన కర్త విభీషణ శర్మకు ప్రవచన విశారద బిరుదు ప్రదానం చేస్తున్న స్వామీజీలు

పెందుర్తి: శ్రీశారదాపీఠం వార్షికోత్సవాలు వైభవంగా ముగిశాయి. హోమాలు, కల్యాణాలు, పారాయన మహాయజ్ఞాల నడుమ శాస్త్రోక్తంగా సాగిన క్రతువు విశేషంగా ముగిసింది. ఆఖరిరోజు మహిషాసుర మర్ధిని అవతారంలో రాజశ్యామల అమ్మవారిని అలంకరించారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీలు అమ్మవారికి విశేష పూజలు జరిపారు. తొలుత వార్షిక హోమాలకు స్వయం జ్యోతి మండపంలో పూర్ణాహుతిలో నిర్వహించారు. అనంతరం యాగాశాలలో మహారుద్ర సహిత రాజశ్యామల యాగానికి మహాపూర్ణాహుతి చేశారు. ప్రవచన కర్త విభీషణ శర్మకు ప్రవచన విశారద బిరుదును ప్రదానం చేశారు. పండిత ప్రముఖులు ముష్టి భీమశంకరశాస్త్రి, ముష్టి పురుషోత్తమశర్మ, ముక్కామల సుబ్రహ్మణ్యేశ్వరశర్మ, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును స్వామీజీ సత్కరించారు. ఆఖరి రోజు ఉత్సవంలో పాల్గొన్న భక్తులకు పీఠం ప్రతినిధులు ప్రసాద వితరణ చేపట్టారు.

వలంటీర్ల సేవలు అద్భుతం

- వలంటీర్ల సత్కార కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ


గోవాడ సచివాలయంలో వలంటీర్లను సత్కరిస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ


వడ్డాదిలో వలంటీర్లను సత్కరిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: వలంటీర్ల సేవలు అద్భుతమని, ప్రతి ఇంట్లో కుటుంబ సభ్యులుగా మారారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కొనియాడారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి సేవారత్న, మిత్ర, వజ్ర అవార్డులు అందుకున్న వలంటీర్లను సోమవారం ఘనంగా సత్కరించారు. మండలంలోని గోవాడ, అంబేరుపురం, భోగాపురం గ్రామ సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న వలంటీర్లను గోవాడ సచివాలయ ఆవరణంలో సత్కరించి జ్ఞాపికలు ఇచ్చారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ అర్హత ఉంటే చాలు ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలను నేరుగా అందించేందుకు సచివాలయం–వలంటీర్ వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారన్నారు. ప్రజల కష్టసుఖాల్లో తోడుగా ఉంటున్న ఈ వ్యవస్థను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రానున్న రోజుల్లో మరింత బలోపేతం చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఎంపీపీ గాడి కాసు, ఎంపీటీసీలు కోటి భూలోకి, శరగడం నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి నాగదుర్గ గోవింద, సర్పంచ్‌లు ఏడువాక అచ్చియ్యమ్మ, కార్లె ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లలకు సముచిత స్థానం

బుచ్చెయ్యపేట: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల చెంతకు చేరుస్తున్న వలంటీర్లకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానం కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. మేజర్ పంచాయతీ వడ్డాదిలో మంగళాపురం, విజయరామరాజుపేట, వడ్డాది–1, 2, లోపూడి, పొట్టిదొరపాలెం, కొమళ్లపూడి సచివాలయ పరిధిలోని గ్రామ వలంటీర్లను ఆయన ఘనంగా సత్కరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ నాలుగున్నరేళ్ల పాలనలో రూ.2.57 లక్షల కోట్ల సంక్షేమ పథకాల నగదును సీఎం జగన్ వలంటీర్ల చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారన్నారు. రెండో సారి ఆయన ముఖ్యమంత్రి అయిన వెంటనే వలంటీర్ల గౌరవ వేతనాన్ని రెట్టింపు చేయడమే కాక ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని ధర్మశ్రీ చెప్పారు.

జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, పార్టీ మండల అధ్యక్షుడు కె.అచ్చింనాయుడు, మండల సచివాలయ కన్వీనర్ కె.అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, ఎంపీడీవో వెంకటాచార్య, సర్పంచ్‌లు కంటే పద్మరేఖ వెంకట్, ఎల్లపు విజయ్‌కుమార్, తమరాన శ్రీను, మేరుగు బాబూరావు, వేపాడ మధు, దరిమిశెట్టి అప్పలనాయుడు, కోఆపరేటివ్ అధ్యక్షుడు ఎల్లపు విజయ్‌కుమార్, కోరుకొండ రమణ, యెనుముల వాసు, తమరాన రమణ, ఈవో లవరాజు తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌లో కార్పొరేటర్ ఉషశ్రీ ప్రతిభ


గెలుపొందిన బంగారు పతకాలతో కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ

సీతంపేట: బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్–2024 పోటీల్లో జీవీఎంసీ 43వ వార్డు వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ మూడు బంగారు పతకాలు గెలుపొందారు. ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి 18 వరకు రాజమండ్రిలో ఈ పోటీలు జరిగాయి. 40 ప్లస్ మహిళల కేటగిరీలో అద్భుతమైన ప్రతిభతో రాణించి సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో ఉషశ్రీ బంగారు పతకాలు సాధించారు. ఈ విజయాలతో మార్చిలో హర్యానాలోని పంచకులలో జరగనున్న జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనేందుకు ఏపీ తరఫున అర్హత సాధించారు. ఈ సందర్భంగా బంధువులు, స్నేహితులు, పార్టీ నాయకులు ఆమెను అభినందించారు.

పటిష్టంగా విశాఖ మ్యూజియం నిర్వహణ

కమిషనర్ సాయికాంత్ వర్మ


పనులు పరిశీలించి తగు సూచనలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: విశాఖ మ్యూజియం నిర్వహణ మరింత పటిష్టంగా చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్‌తో కలసి సోమవారం విశాఖ మ్యూజియంను పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మిలాన్–2024కు వివిధ దేశాల ప్రతినిధులు విశాఖ విచ్చేస్తున్నారని, వారి సందర్శనార్థమై మ్యూజియంను ఆధునీకీకరించినట్లు చెప్పారు. అనంతరం మరమ్మతులు చేపట్టిన మేరీటైమ్, హెరిటేజ్ మ్యూజియంను పరిశీలించారు. మ్యూజియంలో మంచి చిత్రాలు ఏర్పాటు చేయాలని అదనపు కమిషనర్‌కు కమిషనర్ సూచించారు. పురాతన విగ్రహాలు మరింత అందంగా కనిపించేందుకు ఫోక్ లైట్లను ఏర్పాటు చేయాలని పర్యవేక్షక ఇంజినీర్ సత్యనారాయణరాజును, మ్యూజియం ఆవరణలో మొక్కలు నాటి సుందరంగా తీర్చిదిద్దాలని డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ దామోదర్‌ను, పురాతన వస్తువులు, విలువైన వస్తువులను నిత్యం గమనిస్తూ.. భద్రతా చర్యలు చేపట్టాలని క్యూరేటర్ రమణను ఆదేశించారు. అనంతరం పాండురంగాపురం సమీపం ఆఫీసర్స్ క్లబ్ పక్కన నిర్మాణంలో ఉన్న జీవీఎంసీ గెస్ట్‌హౌస్‌ను పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని పర్యవేక్షక ఇంజినీర్‌ను ఆదేశించారు. ఈఈ రత్నాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు వలంటీర్లకు సేవా పురస్కారాలు

అనకాపల్లి : స్థానిక జీవీఎంసీ కార్యాలయంలో మంగళవారం ఉదయం వలంటీర్లకు సేవా పురస్కారాలతో సత్కరించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చేతుల మీదుగా వలంటీర్లకు సేవా పురస్కార అవార్డులు అందజేసి సత్కరించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, ఏపీ ఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ హాజరవుతారని, జోన్ పరిధిలో కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులు హాజరుకావాలని ఆయన కోరారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


సమ్మె చేస్తున్న కార్మికులు

అనకాపల్లి : కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రుత్తల శంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం(ఆర్‌ఏఆర్ఎస్) కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలంటూ నిరవధిక సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, రాష్ట్ర కార్మికశాఖ జారీ చేసిన జాతీయ పండగ సెలవులు వర్తించేలా చేయాలని, కార్మికుడు మరణిస్తే సహజ మరణానికి రూ.2లక్షలు, ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.5లక్షలు ఇవ్వాలంటూ పలు డిమాండ్ల సాధనకు కార్మికులు సమ్మెబాట పట్టారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నేత గంటా శ్రీరాం, కార్మికులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం నేడు

అనకాపల్లి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు మండల 11వ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో పి.వి.వి.ఎం.మోహనరావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశం ఎంపీపీ గొర్లి సూరిబాబు అధ్యక్షతన జరుగుతుందని, ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విచ్చేయుచున్నట్టు ఆయన పేర్కొన్నారు. మండలంలో ఎంపీటీసీ, గ్రామ సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు హాజరు కావాలని ఆయన కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 1,031 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,850	4,660
మొదటి రకం	3,580	4,240
రెండో రకం	3,420	3,740
మూడోరకం	3,290	3,450

అనకాపల్లి సినిమాలు

ఈగల్	: రాజా
నాగద్వీపం (తెలుగు)	: సత్యనారాయణస్క్రీన్-1
మేడెన్ వెబ్(రెండు షోలు)	: సత్యనారాయణ స్క్రీన్-2
యాత్ర-2	: షిర్డిసాయి
ఊరు పేరు భైరవకోన	: పర్తిసాయి
ఓయ్	: వెంకటేశ్వర
నా సామిరంగ	: శ్రీసత్య
హనుమాన్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 95 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-32 యూనిట్లు, బీ పాజిటివ్-36 యూనిట్లు, ఓ పాజిటివ్-25 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 317 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 305 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

నేడే కన్యకాపరమేశ్వరి ఆలయ వందేళ్ల వేడుకలు


ఆలయ ముఖద్వారం

- బ్రిటిష్‌కాలం నాటి అమ్మవారి ఆలయం
- ఆలయ చరిత్ర ఘనం



కన్యకాపరమేశ్వరి అమ్మవారు, ఆలయ మండపం

అనకాపల్లి : పట్టణంలో బ్రిటిష్ కాలంలో మెయిన్ రోడ్డులో కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయాన్ని నిర్మించి అప్పటి పెద్దలు బిళ్లపాటి కాశీ విశ్వనాథం అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. పెద్ద కొండ రాయితో ఆలయం నిర్మించడంతో నేటికీ నేటికి చెక్కు చెదరకుండా ఉంది. 1914 డిసెంబర్ 15న కన్యకాపరమేశ్వరి దేవస్థానం సొసైటీగా అప్పటి పెద్దలు రిజిస్ట్రేషన్ చేయించారు. 1914లో అమ్మవారి ఆలయ నిర్మాణానికి స్థలాన్ని 5.5 ఎకరాలు విస్తీర్ణం కావాలని అప్పటి పెద్దలు నిర్ణయించడంతో వెదుళ్లవారి కుటుంబం సభ్యుల నుంచి 3.70 ఎకరాలు, మిగిలిన 1.8 ఎకరాలు ఇతరుల నుంచి సొసైటీ సభ్యులు కొనుగోలు చేసి దేవస్థానానికి కొంత నగదు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అప్పటి నుంచి ఆలయ నిర్మాణానికి పనులు ప్రారంభించి 1925 ఫిబ్రవరి 4వతేదీన (భీష్మ ఏకాదశిరోజున)శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని ఆలయంలో 11 సంవత్సరాలు తరువాత ప్రతిష్ఠించి జీవం పోశారు. స్వర్గీయ బిళ్లపాటి కాశీవిశ్వనాథం కార్యదర్శిగాను, స్వర్గీయ గ్రంధి హనుమంతరావు అధ్యక్షులుగా, స్వర్గీయ జల్లు సీతారామయ్య కోశాధికారిగాను ఈ సంస్థను, సొసైటీని ముందుకు నడిపించారు. వందేళ్ల చరిత్ర కలిగిన కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ శత జయంతి వేడుకలు నిర్వహించేందుకు ఈనెల 20న దేవస్థానం సొసైటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వైశ్య వ్యాపారులు వారి వ్యాపారంలో కొంత నగదును దేవాలయం అభివృద్ధికి విరాళంగా అందజేస్తున్నారు. దినదిన అభివృద్ధి చెందుతూ నాలుగు కల్యాణ మండపాలు , వ్యాపార సముదాయాలతో నేడు అభివృద్ధి పథంలో సంస్థ ముందుకు సాగుతుంది. ఇక్కడ రెండు అతిథి గృహాలు, దేవాలయం అర్చకుల నివాసానికి-2, మహిళా సంఘం, జ్యోతి


ఆలయ ఆవరణలో జ్యోతిర్లింగాలు

లింగములు, ప్రార్థన గానసంఘం, గోశాల, రామకోటి సంఘ, వంటసాల నిర్మించారు. తెల్లవారుజాము నుంచి రాత్రి 7 గంటల వరకు ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు పేర్కొన్నారు.

22న మరిడిమాంబ జాతర


విద్యుత్‌సెట్టింగ్ ముఖద్వారం


మరిడిమాంబ అమ్మవారి ఆలయం

అనకాపల్లి : స్థానిక విజయరామరాజుపేట 117 సంవత్సరాలు చరిత్ర కలిగిన శ్రీ మరిడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవం ఈనెల 22న నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు శ్రీకారం చుట్టారు. ప్రతి ఏడాది మాఘమాసంలో ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఎనిమిదేళ్ల క్రితం సుమారు ఆరుసెంట్లు స్థలాన్ని ఆళ్ల అప్పడు కుటుంబ సభ్యులు అమ్మవారి ఆలయ నిర్మాణానికి ఉచితంగా ఇవ్వడంతో గ్రామంలో ప్రజల సహాయంలో అమ్మవారి ఆలయాన్ని పునర్నిర్మాణం చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 20వ తేదీన మరిడిమాంబ అమ్మవారి పుట్టిక పాటక కార్యక్రమం ఉదయం 8 గంటలకు నిర్వహిస్తారు. 21న అమ్మవారి ఘటాల ఊరేగింపు రాత్రి 8 గంటలకు విజయరామరాజుపేట గ్రామంలో జరుగుతుంది. అదేరోజు రాత్రి అమ్మవారి నకల భగవతం నిర్వహించడం జరుగుతుంది. 22న తెల్లవారు జామున అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తారు. అదేరోజు రాత్రి స్టేజ్ ప్రోగ్రాంలు, నేలవేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, 101 కేజీల కోవ ప్రసాద వితరణ, కోలాటం, చిటికలు, తప్పెటగుళ్లు, నగర సంకీర్తన వంటి కార్యక్రమాలు చేపడతారు.

నేడు స్వామి పరమార్ధదేవ్ రాక

అనకాపల్లి : స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో మంగళవారం జరిగే యోగా కార్యక్రమానికి స్వామి పరమార్ధదేవ్ వస్తున్నట్టు యోగా గురువులు భీశెట్టి దొరమ్మనాయుడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పరిసర ప్రాంతాల నుంచి 500 మంది హాజరయ్యేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రీ సర్వేలో లోపాలపై దరఖాస్తుల స్వీకరణ

మునగపాక : మునగపాక రీ సర్వేలో లోపాలను సవరించేందుకు మంగళవారం అధికారులు అందుబాటులో ఉంటారని డీటీ వినయ్ ఒక ప్రకటనలో తెలిపారు. ముసిలితల్లి గుడి ప్రాంగణంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. రీ సర్వేలో భూములకు సంబంధించి తేడాలుంటే రైతులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వినయ్ కోరారు.

ఘనంగా వమ్మవరం వెంకన్న కల్యాణం


ఆలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం


స్వామివారి కల్యాణ మహోత్సవం

ఎస్.రాయవరం : వమ్మవరం గ్రామంలో స్వయంభూ అలువేలు మంగా , పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం రాత్రి వైభవంగా స్వామి కల్యాణం నిర్వహించారు. ప్రతిఏడాది భీష్మ ఏకాదశి నాడు ఈ వేడుక నిర్వహించడం ఆనవాయితీ గావస్తుంది. ఈ సందర్భంగా ఆలయంలో రెండు రోజులుగా శాంతి హోమం నిర్వహించారు. రాత్రి ఆచార సంప్రదాయాలతో కల్యాణం నిర్వహించారు. ఈ వేడుకల్లో వమ్మవరం గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన పెనుగొల్లు, గెడ్డపాలెం, పి.ధర్మవరం గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

ఆధ్యాత్మికతపై అవగాహన


పెదకలవలాపల్లిలో సమరసత సేవా సభ్యులు

రాంబిల్లి : పెదకలవలాపల్లిలో సోమవారం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మికతపై అవగాహన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమరసత సేవా సభ్యుల సమోదు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భజనలు, కోలాటాలు, సామూహిక పూజలు, హారతులు, సంస్కృతి, సంప్రదాయాలపై వక్తలు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సమరసత ప్రతినిధులు అప్పారావు, వెంకటలక్ష్మి, అప్పలకొండ, వరలక్ష్మి పాల్గొన్నారు.

నేత్రపర్వంగా భావనారుషి కల్యాణం

అంగరంగ వైభవంగా శూలాల సంబరం


భావనారుషి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

నక్కపల్లి : చుక్కలవాని లక్ష్మీపురంలో భద్రావతి సమేత భావనారుషి కల్యాణ మహోత్సవం సోమవారం నేత్రపర్వంగా జరిగింది. శూలాల సంబరాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా మాఘమాసంలో ఇక్కడ ఈ కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభంగా నిర్వహిస్తారు. సోమవారం ఉదయం ఉత్సవ విగ్రహాలకు పుష్పాలంకరణ, కల్యాణ మహోత్సవం నిర్వహించారు. అనంతరం విభూది పండ్లు ఊరేగింపు జరిగింది. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్న సమారాధన జరిపారు. తదుపరి భజన కార్యక్రమం జరిగింది. సాయంత్రం 3 గంటలకు అమ్మవారి పుట్టింటి సారె ఊరేగింపు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో సాయంత్రం 4 గంటలకు కోలాటం ఏర్పాటు చేశారు. నగర సంకీర్తన దీపోత్సవం జరిగింది. రాత్రి 7 గంటలకు అశ్వరథ ప్రతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రాత్రి 7 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మెగా డాన్స్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాత్రి 11 గంటలకు శూలాల సంబరం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా పద్మశాలీ భక్తులు శూలాలు నాలుకపై గుచ్చుకుని ప్రభలు పట్టుకుని నృత్యాలు చేస్తూ తెల్లవార్లూ జాగరణ చేస్తూ ఊరేగింపు జాతర నిర్వహించారు. ఈ సంబరాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు, ప్రజలు తరలి వచ్చారు. గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుద్దీకరణ ఆకట్టుకుంది. అనంతరం ఆలయం వద్ద అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. సంబరం సందర్భంగా పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. గ్రామాల్లో సర్పంచ్ కర్రి గీతా రాజబాబు ఆధ్వర్యంలో శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహించారు.

స్వచ్ఛ సంకల్పంపై కళాజాత


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

ఎస్.రాయవరం : స్వచ్ఛ సంకల్పం, ఆరోగ్య విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం మంచి పరిణామం అని గుడివాడ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని ఎం.శ్రీదేవి అన్నారు. పంచాయతీరాజ్‌శాఖ ఆదేశాల మేరకు వివిధ పాఠశాలల్లో నిర్వహిస్తున్న కళాజాత బృందం సోమవారం గుడివాడ ఉన్నత పాఠశాలలో ప్రదర్శన ఇచ్చారు. బాల్యవివాహాల నిర్మూలన, వ్యక్తిగత మరుగుదొడ్ల వాడకం, ప్లాస్టిక్ వినియోగం నిర్మూలన, మొక్కలు పెంచడం వల్ల లాభాలు వంటి సామాజిక ప్రయోజనాలపై బృందగానం రూపంలో విద్యార్థులకు వివరించారు.

ఎంపీటీసీల నిధులతో బోర్లు, రహదారుల నిర్మాణం


మండల బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జయలక్ష్మి

మునగపాక : తమకు కేటాయించిన నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం బడ్జెట్‌పై ఎంపీటీసీలతో ఆమె సమావేశమయ్యారు. ఎంపీటీసీలకు కేటాయించిన నిధులతో అవసరమైన చోట బోర్లు, రహదారుల నిర్మాణాలపై దృష్టి సారించాలన్నారు. ఏఏ పనులు చేపట్టాలనే అంశాలతో 22న జరగనున్న మండల సమావేశానికి హాజరుకావాలని సూచించారు. వైస్ ఎంపీపీ చిందాడ దేవి, పలువురు ఎంపీటీసీలు సమావేశంలో పాల్గొన్నారు. కాగా మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్ బడ్జెట్ వివరాలను ఎంపీటీసీలకు తెలియజేశారు.

పోటీతత్వంతోనే లక్ష్య సాధన

మాకవరపాలెం: విద్యార్థుల్లో పోటీతత్వంతోనే లక్ష్యాలను చేరుకోగలరని ఎంఈవో పి.ఎస్.ఎన్.మూర్తి అన్నారు. గౌతమి లలితకళా శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో ఉగాది వేడుకల్లో భాగంగా సోమవారం మండల స్థాయిలో విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలను ఎంఈవో ప్రారంభించి మాట్లాడారు. ఇలాంటి పోటీలతో విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయొచ్చన్నారు.

ఘనంగా శివాజీ జయంతి


ఛత్రపతి శివాజీ చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న దృశ్యం

మునగపాక : నాగులాపల్లిలో సోమవారం ఛత్రపతి శివాజీ 394వ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బీజేపీ ఐటీ విభాగం జిల్లా కన్వీనర్ మళ్ల కాశీశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా పలువురు శివాజీ చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జామి చినమ్మలు మాట్లాడుతూ దేశంలో మరాఠా సామ్రాజ్యాన్ని స్థాపించి సనాతన హిందూ ధర్మాన్ని కాపాడడంలో శివాజీ ఎంతో కృషి చేశారన్నారు. మొఘల్ చక్రవర్తులను ఎదిరించి వారి దురాగాతాలకు చరమగీతం పాడిన శివాజీ అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. పీఏసీఎస్ చైర్‌పర్సన్ మళ్ల ఉమామహేశ్వరరావు, ఎంపీటీసీ మళ్ల కాశీసురేష్, వైస్ ఎంపీపీ చిందాడ దేవి, వెంకటేశ్వర పల్లకి కమిటీ సభ్యులు బొడ్డేడ బుజ్జి, యల్లపు వెంకటప్పారావు, శరగడం జగన్‌మోహన్‌రావు పాల్గొన్నారు.

'పంచాయతీ కార్మికుల జీతం బకాయిలు చెల్లించాలి'


కార్మికుల బకాయి జీతాలపై డీపీవోకు వినతి పత్రం అందిస్తున్న యూనియన్ నాయకులు

తుమ్మపాల : గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డులకు బకాయి ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని సీఐటీయు ఆధ్వర్యంలో ఏపీ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు పి.చిన్నారావు, ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. రేబాక గ్రామంలో గల జిల్లా పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం నిరసన చేసి డీపీవో ఆర్.శిరీష రాణికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సకాలంలో కార్మికుల జీతాలు చెల్లించకపోవడంతో కార్మికులంతా అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. అసంపూర్తి జీతాలు కారణంగా చెబుతూ అధికారులు కార్మికుల సంఖ్యను తగ్గిస్తుండడంతో పని భారం పెరిగిపోతుందన్నారు. అనేక పంచాయతీల్లో 7 నెలల నుంచి అత్యధికంగా 18 నెలల జీతాలు చెల్లింపులు బకాయి ఉన్నట్టు తెలిపారు. కనీస వేతనాలు కూడా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయు జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, ఏపీ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు యు.లోకేష్, వెంకటరమణ, ఆర్.దేముడునాయుడు పాల్గొన్నారు.

జనసేన నాయకుడు వైఎస్సార్‌సీపీలో చేరిక


జానకీరాంకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న భరత్‌కుమార్

అనకాపల్లి : గ్రేటర్ విశాఖ విలీనగ్రామమైన కొప్పాక, కె.ఎన్.ఆర్.పేట, సిరసపల్లి గ్రామాల్లో పలువురిని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ సోమవారం పరిచయం చేసుకున్నారు. కె.ఎన్.ఆర్.పేట గ్రామానికి చెందిన జనసేన నాయకుడు గొలవిల్లి జానకీరాంతో పాటు మరో పదిమంది ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. జానకీరాంకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పలకా రవి, ఎంపీపీ గొర్లి సూరిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, 84వవార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ, పార్టీ నేతలు వేగి త్రినాథ్, ఈగల మహేష్ పాల్గొన్నారు. శారదానగర్‌లో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి భీశెట్టి జగన్ ఆధ్వర్యంలో పార్టీకి చెందిన కార్యకర్తలను పరిచయం చేసుకున్నారు. పలు చోట్ల జరిగిన వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

రేపటి నుంచి బీజేపీ ప్రజా పోరుయాత్ర


మాట్లాడుతున్న బొడ్డేడ నాగేశ్వరరావు

అనకాపల్లి : బీజేపీ ఆధ్వర్యంలో ఈనెల 21 నుంచి 29వ తేదీ వరకూ ప్రజా పోరు యాత్ర రెండో విడత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆపార్టీ నియోజకవర్గ కన్వీనర్ బొడ్డేడ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక చదువులవారివీధిలో జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయాన మాట్లాడారు. గ్రామీణ స్థాయి నుంచి ప్రజాపోరు యాత్రం మొదటి దశలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం జరిగిందని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను ప్రతీ ఇంటికి చేరవేయడంలో పార్టీ కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొణతాల రాజాబాబు, ప్రజా పోరుయాత్ర కన్వీనర్ బొడ్డేడ శేషగిరిరావు, కో కన్వీనర్ గేదెల స్వరూప్, ఉప్పలపు చిట్టిబాబు పాల్గొన్నారు.

ఘనంగా విజయదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ట


హరిపాలెం కొండపై వెలసిన విజయదుర్గమ్మ వారు


హరిగిరిపై వెలసిన విజయదుర్గమ్మ ఆలయం


ఆలయానికి ప్రారంభోత్సవం చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు


ఆలయంలో భక్తుల కోలాహలం

అచ్యుతాపురం : మండలంలోని హరిగిరిపై వెలసిన విజయదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. తెల్లవారు జాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తుల సహకారంతో నూతన ఆలయాన్ని నిర్మించారు. ఈ క్రమంలో హోమాలు చేపట్టారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్‌దీపాలను అలంకరించడంతో పాటు, పూలతో సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ ఆహ్వాన కమిటీ చైర్మన్ మారిసెట్టి సూర్యానారాయణ, సర్పంచ్ లక్ష్మీకాంతం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఆలయాన్ని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు (కన్నబాబు) చేతుల మీదుగా ప్రారంభించారు. అమ్మవారిని డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ దర్శించుకున్నారు.

పొగమంచు తెర...సూరీడి సెగ


యండపల్లి ప్రాంతంలో కమ్మేసిన పొగమంచు

కోటవురట్ల: పగలంతా మండిపోతున్న ఎండలు.. సాయంత్రం అయితే చలిగాలులు...మళ్లీ తెల్లవారు జామున వీడని మంచుతెరలు ఇదీ మైదానంలోని పరిస్థితి. గత కొద్ది రోజులుగా తెల్లవారు జామున పొగమంచు కమ్మేస్తూ చలి చంపేస్తోంది. ఉదయం 9 గంటలైనా మంచు వీడడం లేదు. ఇక ఉదయం 11 నుంచి సూరీడు రంగప్రవేశం చేసి భగ భగ మండిపోతున్నాడు. ఎండలు ఒక్కసారిగా పెరగడంతో పగలు ఎండ వేడికి అల్లాడి పోతున్నారు. మరో పక్క తెల్లవారు జామున ప్రయాణాలు చేసేందుకు మంచుతో చలి తీవ్రత వేధిస్తోంది. పొగమంచు కారణంగా మామిడి, జీడి పూతలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం జీడి, మామిడి పూతలు విపరీతంగా ఉండి పిందెగా మారుతోంది. ఈ దశలో పొగమంచు రైతులను కలవరపరుస్తోంది.

అక్రమ మద్యం కేసులో ఒకరి అరెస్ట్

రాంబిల్లి: అక్రమ మద్యం కేసులో సోమవారం ఒక వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు సీఐ ఎస్. లక్ష్మణరావు తెలిపారు. వెంకటాపురానికి చెందిన ఒక వ్యక్తి అక్రమంగా మద్యం తరలిస్తుండగా పట్టుకొని అతని నుంచి ఆరు మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయించినా, తరలించినా కేసులు తప్పవని సీఐ హెచ్చరించారు.